# చదువు విలువ

''ఏం చేస్తున్నావు వెంకన్నా?'' కేకేశాడు రంగనాథం మాస్టారు.

''దండాలయ్యగారూ! ఏంటి సారూ! ఇలా వచ్చారు?'' ఆశ్చర్యంగా అడిగాడు వెంకన్న.

''మరేం లేదు. మొన్నటివరకు మీ అమ్మాయి జ్యోతి మా బడిలో చదివేది. చదువులో చాలా చురుగ్గా ఉండేది. కానీ చదువు పూర్తికాక ముందే మానిపించావు. ఇలా మధ్యలో బడి మానేసిన పిల్లల కోసం ప్రభుత్వం 'చదువుల పండుగ' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. అందుకు మీ అమ్మాయిని మళ్లీ బడిలో చేర్పించడానికి వచ్చాను'' చెప్పాడు రంగనాథం మాస్టారు.

''అది కుదరదు బాబయ్యా. మేము చాలా పేదోళ్లం. ఇప్పటికి చదివింది చాలు. అదీగాక ఆడపిల్లకు చదువెందుకు బాబయ్యా! ఎంత చదివినా వేరే ఇంటికి వెళ్లాల్సిందే కదా!'' చెప్పాడు వెంకన్న.

''అలా అనకు వెంకన్న. అది ఒకప్పటి మాట. చదువు అందరికీ అవసరమే. దానికి తేడాల్లేవు. ఇంకా ఈ కాలంలో ఆడపిల్లకి చదువు చాలా అవసరం. అదీగాక డిగ్రీ వరకు ప్రభుత్వమే చదివిస్తుంది'' చెప్పాడు మాస్టారు.

''ఏమో బాబయ్యా! అదంతా నాకు తెలియదు'' అన్నాడు వెంకన్న.

''ముందు ముందు అదే తెలుస్తుందిలే. ఆడపిల్ల చదువుకుంటే కుటుంబమంతా చదువుకున్నట్లే. కష్టకాలంలో ఎవరిపై ఆధారపడకుండా తన కాళ్లపై తానే నిలబడుతుంది'' వివరంగా చెప్పాడు మాస్టారు.




''సరే బాబయ్యా! అన్నీ తెలిసినోళ్లు మీరింతగా చెబుతుంటే కాదంటానా! మరల బడిలో చేర్పిస్తాను బాబయ్యా!'' ఆనందంగా చెప్పాడు వెంకన్న.

''చాలా సంతోషం. రేపు చేర్పించు'' వస్తానంటూ వెళ్లిపోయాడు మాస్టారు.

కొన్నాళ్లయ్యాక వచ్చిన ఒకమ్మాయి ''నమస్కారం సార్'' అంటూ పలకరించడంతో ''ఎవరమ్మా నువ్వు. గుర్తుపట్టలేకపోతున్నాను'' అన్నాడు మాస్టారు.

''నేను సార్ జ్యోతిని. చదువు మధ్యలో నన్ను మానిపిస్తే తిరిగి మా నాన్నకు నచ్చచెప్పి తిరిగి బడిలో చేర్పించిన జ్యోతిని సార్'' చెప్పింది జ్యోతి.

''ఆ ఆ... గుర్తుకు వచ్చింది. ఇపుడేం చేస్తున్నావమ్మా?'' ఆనందంగా అడిగాడు మాస్టారు.

''ఎం.డి.ఓ.గా సెలక్టయ్యాను సార్'' ఆనందంగా చెప్పింది జ్యోతి.

''అలాగామ్మా చాలా సంతోషం''

''ఇదంతా మీ చలువే మాస్టారూ. ఆనాడు మీరు మధ్యలో బడి మానేసిన నన్ను మా నాన్నను ఒప్పించి స్కూల్లో చేర్పించకపోతే నేనీనాడు ఎక్కడో మారుమూల గ్రామంలో అనామికగా ఉండేదాన్ని. అందుకే ఉద్యోగం రాగానే కృతజ్ఞతలు తెలపాలని వెతుక్కుంటూ వచ్చాను. నా సంతోషం కోసం ఇవి తీసుకొని నన్ను ఆశీర్వదించండి మాస్టారు'' కృతజ్ఞతగా కాళ్లకు వంగి నమస్కారం చేసింది జ్యోతి.

''నాదేముందమ్మా, నా విధిని నేను నిర్వహించాను. నీలాగే ప్రతి ఆడపిల్ల చదువు విలువను తెలుసుకొని చదవాలి. ఎంతో ఎత్తుకు ఎదగాలి. అప్పుడే దేశమెంతో అభివృద్ధి చెందుతుంది. నా విద్యార్థులందరికీ నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయమ్మా'' అంటూ ఆనందంగా చేయెత్తి మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు రంగనాథం మాస్టారు.

**-ఎస్.కె.దుర్గ (క్యాతూరు)**




